

మంగళవారం ఎర్రవెల్లిలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ ముఖ్య నేతలు. చిత్రంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్ తదితరులు

## లోకం పోకడ




• ప్రియాంకా జీ.. స్కూటీ ఎక్కడ?



'ప్రియాంకా జీ.. స్కూటీ ఎక్కడ?' అంటూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. స్కూటీ మినీయేచర్‌తో ఉన్న జిబ్లీ ఇమేజ్‌ను ఆమె పోస్ట్ చేశారు.

## అబద్ధాలలో బండి, రేవంత్ పోటీ



హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పేరు తీయకుంటే.. 'ఆర్‌ఎస్ బ్రదర్స్'కు బతుకే లేదని నిరూపించుకుంటున్నారని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి విమర్శించారు. అబద్ధాలలో బండి, రేవంత్ పోటీపడుతున్నారని..'రేవంత్ కోసం బండి సంజయ్.. బండి సంజయ్ కోసం రేవంత్ రెడ్డి' అల్లాడిపోతున్నారని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ కేసీఆర్ కుటుంబం ఫేక్ కరెన్సీ ముంద్రించిందని అనడం చిల్లర రాజకీయాలకు నిదర్శనమని దుయ్యబట్టారు.

# వైభవంగా రజతోత్సవ సభ

- రాష్ట్రంలో కేసీఆర్ పాలన తిరిగి తెస్తాం
- తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష
- రామప్పకు యునెస్కో గుర్తింపు, ఓరుగల్లు అభివృద్ధి ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే
- రజతోత్సవ సభ నేపథ్యంలో పార్టీ అధినేతతో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల భేటీ



హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేస్తామని ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ నేతలు ప్రతినబూనారు. కేసీఆర్ పరిపాలనను తిరిగి రాష్ట్ర ప్రజలకు అందిస్తామని శపథం చేశారు. తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు, వరంగల్‌లో కాకతీయ టెక్స్‌టైల్ పార్క్, చెరువుల పునరుద్ధరణకు మిషన్ కాకతీయ పేరుపెట్టడం, రాజముద్రలో కాకతీయ కళాతోరణం ఏర్పాటు వంటివి కేసీఆర్ హయాంలోనే సాధ్యమైందని సంతోషం వ్యక్తంచేశారు. ఈ నెల 27న వరంగల్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా ముఖ్య నేతలు ఎర్రవెల్లి నివాసంలో పార్టీ అధినేత కేసీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సభ నిర్వహణ, ఏర్పాట్లపై కేసీఆర్‌తో చర్చించారు. పార్టీ అధినేత నుంచి పలు సలహాలు, సూచనలు స్వీకరించారు. రజతోత్సవ మహాసభ బాధ్యతలను తమ జిల్లాకు అప్పగించినందుకు కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, తాటికొండ రాజయ్య, సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, డీఎస్ రెడ్యానాయక్, శంకర్‌నాయక్, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, గండ్ర జ్యోతి, నాగజ్యోతి తదితర జిల్లా ముఖ్యనేతలతోపాటు మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఏ జీవన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వంశీధర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా నేతలు మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ అధినేత ఆదేశాలతో ఉద్యమ సమయంలో కూడా అనేక భారీ సభలను సమర్థంగా నిర్వహించి విజయవంతం చేశామని చెప్పారు. వరంగల్‌లో సభ నిర్వహణ పార్టీకి కలిసొచ్చే అంశమని ఆనందం వ్యక్తంచేశారు. ఇప్పటికే వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తి వద్ద 1,213 ఎకరాల స్థలాన్ని రజతోత్సవ మహాసభ నిర్వహణ కోసం తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇందులో 154 ఎకరాలు మహాసభ ప్రాంగణం ఉంటుందని చెప్పారు. పార్కింగ్ కోసం 1,059 ఎకరాలు కేటాయించామని, ఇందులో దాదాపు 50,000 వాహనాలను పార్కింగ్ చేసుకునే వీలుంటుందని తెలిపారు. కనీవినీ ఎరుగని రీతిలో మహాసభను నిర్వహిస్తామని, రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు, తెలంగాణవాదులు, ప్రజలు భారీ ఎత్తున తరలివస్తారని చెప్పారు. సభకు తరలివచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 10 లక్షల నీళ్ల బాటిళ్లను సిద్ధంగా ఉంచనున్నట్టు వివరించారు. ట్రాఫిక్ తదితర ఏర్పాట్లకు ఎటువంటి ఆటంకం కలగకుండా 1,500 మంది వలంటీర్లతో పాటు అత్యవసర వైద్యసేవలను, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

### తెలంగాణకు కేసీఆర్ శ్రీరామరక్ష

**తెలంగాణకైనా**, వరంగల్ కైనా కేసీఆరే శ్రీరామరక్ష అనే విషయం మరోసారి నిరూపితమైందని వరంగల్ నేతలు పేర్కొన్నారు. పదేండ్ల పాలనలో ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు. రెండు వేల ఎకరాల్లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటుచేసి, తెలంగాణ నేతన్నలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ వస్త్ర పరిశ్రమకు ఊతమిచ్చే దిశగా చర్యలు చేపట్టారని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న సూపర్ స్పెషాలిటీ దవాఖానాలకు పోటీనిచ్చే రీతిలో వరంగల్‌లో 24 అంతస్థుల మల్టీ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణం బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రారంభం కావడం గొప్ప విషయమని చెప్పారు. వరంగల్‌ను స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేయడంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేసినట్టు వివరించారు. హైదరాబాద్‌తో పోటీపడే విధంగా వరంగల్, హనుమకొండ జంట నగరాలను అభివృద్ధి చేస్తూనే, జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు అభివృద్ధిని విస్తరించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.

### నాటి ఉద్యమ స్ఫూర్తితో పనిచేస్తాం

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన శాంతియుత పోరాటంలో అనేక సభలను నిర్వహించుకున్న ఘనత వరంగల్ గడ్డకు ఉన్నదని ఆ జిల్లా నేతలు తెలిపారు. ఉద్యమ సమయంలో నిర్వహించిన విశ్వరూప మహాసభ విజయవంతమైన స్ఫూర్తితో రజతోత్సవ మహాసభను కూడా విజయవంతం చేస్తామని ధీమా వ్యక్తంచేశారు. వరంగల్ గడ్డ ముద్దుబిడ్డలు మహాకవి కాళోజీ నారాయణరావు, తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్ని అర్పించిన ప్రొఫెసర్ జయశంకర్ అందించిన ఉద్యమ స్ఫూర్తితో తిరిగి పార్టీ కోసం, ప్రజల కోసం తమ కార్యాచరణను అమలు చేస్తామని చెప్పారు.

### కేసీఆర్ హయాంలో ప్రాజెక్టులు పూర్తి

సాగునీటి ప్రాజెక్టులైన కాళేశ్వరం, దేవాదులను పూర్తిచేయడం, సమ్మక్క బరాజ్ నిర్మాణం, హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను తొలి ద్వితీయ శ్రేణి ఐటి నగరంగా తీర్చిదిద్దడం, కాళోజీ కళాకేంద్రం నిర్మాణం, వరంగల్‌కు పోలీస్ కమిషనరేట్ హోదా కల్పించడం కేసీఆర్ ప్రభుత్వ ఘనతలని వరంగల్ జిల్లా నేతలు వివరించారు. తిరిగి కేసీఆర్ పాలనను తెలంగాణ ప్రజలకు అందించడం ద్వారా వరంగల్ జిల్లా కేసీఆర్ రుణం తీర్చుకుంటుందని చెప్పారు. కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకొని, గాడితప్పిన రైతన్నల సంక్షేమాన్ని, అభివృద్ధిని గాడిలో పెట్టడానికి వరంగల్ జిల్లా బిడ్డలుగా ముందు వరుసలో ఉంటామని ప్రతినబూనారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి, అధినేతకు బహుమతిగా అందజేస్తామని చెప్పారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలో కొడుకును ఎత్తుకుని కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న తల్లి కల్పన

## పసికందుకు కేటీఆర్ వైద్య సాయం

**గుండె ఆపరేషన్‌కు చొరవ**

**కృతజ్ఞతలు తెలిపిన చిన్నారి తల్లిదండ్రులు**

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 1: ఆపదలో ఉన్న ఓ పసికందు ప్రాణాన్ని కాపాడారు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మొండలం అక్కపల్లికి చెందిన ముక్క బాల్‌రాజు–కల్పన దంపతుల కుమారుడు భరత్‌కుమార్. పుట్టుకతోనే బాలుడి గుండెకు రంధ్రం ఉందని, మందులతో తగ్గుతుందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆ చిన్నారికి ఐదు నెలలు. మూడు నెలల వయసు వచ్చే సరికి రంధ్రం తగ్గకపోగా సమస్య పెద్దదై, శ్వాస ఇబ్బంది ఏర్పడింది. దీంతో గత నెల 7న హైదరాబాద్‌లోని రెయిన్‌బో హాస్పిటల్‌కు తరలించారు. ఆపరేషన్ కోసం రూ.8 లక్షలు అవుతుందని చెప్పడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో బాలుడి తల్లికి బంధువైన అల్మాస్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ములిగె ప్రమోద్ ఈ విషయాన్ని కేటీఆర్‌కు గత నెల 9న వాట్సాప్‌లో సమాచారం అందించాడు. కేటీఆర్ వెంటనే స్పందించి బాలుడి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేశారు. గత నెల 11న బాలుడికి ఆపరేషన్ పూర్తయింది. తమ కొడుకు ఆపరేషన్ కోసం సాయం అందించిన కేటీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కిటెక్స్‌తో 25 వేల ఉద్యోగాలు

**కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనం కేటీఆర్**

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కిటెక్స్ సంస్థ ద్వారా 25,000 ఉద్యోగ అవకాశాలు సృష్టించడం చూస్తే చాలా ఆనందంగా ఉన్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఇండియాలో అత్యంత పెద్దదైన కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌ను వరంగల్‌లో స్థాపించిన కేసీఆర్ ముందుచూపుకు ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ హయాంలో వరంగల్‌లో 1,350 ఎకరాల్లో టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటైన ఫొటోలను మంగళవారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. 25,000 ఉద్యోగ ఖాళీలకు దరఖాస్తు చేసుకోవాలని కిటెక్స్ ఇచ్చిన పత్రికా ప్రకటనను పోస్టు చేశారు.

## సిఫారసు లేఖలు బేఖాతరు

**తిరుమలలో తెలంగాణ భక్తులకు ఇబ్బందులు**

**సోషల్ మీడియాలో భక్తుల వీడియో వైరల్**

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమలలో శ్రీవారి దర్శనానికి సిఫార్సు లేఖలకు అనుమతిస్తున్నట్టు టీటీడీ ప్రకటించినా.. కొందరి అధికారుల తీరుతో తెలంగాణ భక్తులు ఇబ్బందులు గురవుతున్నారు. దర్శనం కోసం సిఫార్సు లేఖలు తీసుకొచ్చిన వారిని టీటీడీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ భక్తులు ఆవేదనవ్యక్తం చేసిన ఓ వీడియో మంగళవారం వైరల్‌గా మారింది. తిరుమలలో వీఐపీ దర్శనానికి సిఫార్సు లేఖలు తీసుకొస్తే.. అధికారులు తమను దగ్గరికి కూడా రానివ్వడం లేదని తెలిపారు. ఏపీ భక్తులను మాత్రమే అనుమతిస్తున్నారని పేర్కొన్నారు. సోమ, మంగళవారం దర్శనానికి అనుమతి ఇస్తామని చెప్పి.. ఇప్పుడు సిఫార్సు లేఖలు అంగీకరించడం లేదని అసహనం వ్యక్తంచేశారు. ఇదేంటని అడిగితే దర్శనం లేదు.. వెళ్లిపోండి అంటున్నారని భక్తులు వివరించారు. కాగా, గతనెల 24నుంచి సిఫార్సు లేఖలపై దర్శనాలకు అనుమతిస్తామని టీటీడీ వెల్లడించిన విషయం తెలిసిందే.

## కాంగ్రెస్‌లో ఏమున్నదని చేరినవ్?

**మీరు బీఎస్పీలో ఉంటే నేనే వచ్చేవాడిని**

**కాంగ్రెస్ నాయకుడు విజయ్‌ని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు**



జగిత్యాల, ఏప్రిల్ 1 : 'కాంగ్రెస్ పార్టీలో ఏముంది? నువ్వు అక్కడే ఉంటే నేనే ఆ పార్టీ (బీఎస్పీ)లోకి వద్దామనుకున్నా' అని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఓ కాంగ్రెస్ నాయకుడిని ఉద్దేశించి అన్నారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బర్త్‌డే సందర్భంగా మంగళవారం జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో జీవన్‌రెడ్డి కేక్‌కట్ చేసి అక్కడున్న వారికి తినిపించారు. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి, ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరిన విజయ్‌ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'కాంగ్రెస్ పార్టీలో ఏముంది? నాలాంటి వారికి ఇక్కడ ఏమీ లేదు, నువ్వు అక్కడే ఉంటే నేనే ఆ పార్టీలోకి రావాలని అనుకున్నా' అని పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి కొద్దిరోజులుగా కాంగ్రెస్ హైకమాండ్ తీరుపట్ల అసంతృప్తితో ఉన్నారు.

# గ్రోక్ చెప్పిన 'గ్రోత్' స్టోరీ

▶ మొదటిపేజీ తరువాయి...

వ్యవసాయం, మరోవైపు పరిశ్రమలు, ఇంకోవైపు నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ రంగాలు అభివృద్ధి చెందడంతో రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరిగిందని చెప్పింది. పెట్టుబడులను ఆకర్షించే టీఎస్–ఐపాస్ వంటి విప్లవాత్మక సంస్కరణలు, యువ పారిశ్రామికవేత్తలను తయారుచేసే టీ హబ్, వీ హబ్ వంటి వినూత్న ఆవిష్కరణలు, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి దోహదపడే టీ ప్రైడ్, దళితబంధు వంటి పథకాలు తెలంగాణను ఒక రోల్ మాడల్‌గా నిలిపినట్టు స్పష్టం చేసింది.



### శక్తివనరు కేంద్రంగా హైదరాబాద్

తెలంగాణ పదేండ్ల అభివృద్ధిలో హైదరాబాద్ అత్యంత కీలకపాత్ర పోషించిందని ఏఐ చాట్ బాట్ గ్రోక్ తెలిపింది. ఐటీ, ఐటీ ఆధారిత, ఫార్మా రంగాలతో మహానగరం ఆర్థిక శక్తి వనరు కేంద్రంగా మారినట్టు స్పష్టం చేసింది. 2013–14లో రూ.57,258 కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు.. 2023–24 నాటికి రూ.2,68,233 కోట్లకు చేరాయని వెల్లడించింది. సంవత్సరానికి సగటున 11.32% వృద్ధి రేటు సాధించినట్టు తెలిపింది.

- ఫార్మా బయోటెక్ రంగాల్లోనూ భారీగా పెట్టుబడులు సాధించినట్టు గ్రోక్ తెలిపింది. దేశ ఫార్మా ఉత్పత్తుల్లో తెలంగాణ వాటా 35 శాతానికి పెరిగినట్టు పేర్కొన్నది.
- ఐటీ, ఔషధ రంగాల్లో 22.5 లక్షలకు పైగా ఉద్యోగాల సృష్టి జరిగిందని తెలిపింది.
- నూతన ఐటీ పాలసీ, టీ హబ్ స్థాపన, టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు ప్రోత్సహించడంతో హైదరాబాద్ గ్లోబల్ టెక్ హబ్‌గా మరింత బలపడిందని పేర్కొన్నది.

### వ్యవసాయ రంగంలో ఘన విజయాలు

'నా అభిప్రాయం ప్రకారం కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగం సాధించిన విజయాలు ప్రశంసనీయం. రైతుబంధు వంటి పథకాలు రైతుల జీవన విధానంలో సానుకూల మార్పులు తెచ్చాయి. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు దీర్ఘకాలిక వ్యవసాయ అభివృద్ధికి బాటలు వేశాయి' అని గ్రోక్ ప్రశంసించింది. బీఆర్‌ఎస్ పాలనలో 2014–2023 మధ్యకాలంలో తెలంగాణ వ్యవసాయ రంగం గణనీయమైన విజయాలు సాధించిందని చెప్పింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని మొదటి ప్రాధాన్యంగా తీసుకొని అమలు చేసిన కొన్ని విధానాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేశాయని పేర్కొన్నది.

- రైతుబంధు పథకం రైతుల ఆర్థిక భద్రతను పెంచిందని తెలిపింది. 60 లక్షలకు పైగా రైతు కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందాయని చెప్పింది. విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ ఖర్చుల కోసం రైతులు ఈ నిధులను వినియోగించారని వెల్లడించింది.
- దీంతోపాటు రైతుబీమా, 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్తు వంటి పథకాలు వ్యవసాయ రంగానికి ఊతం ఇచ్చినట్టు పేర్కొన్నది.
- కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని గ్రోక్ తెలిపింది. 2014–15లో 97 లక్షల టన్నుల ఉత్పత్తి ఉండగా, 2022–23 నాటికి ఇది 1.3 కోట్ల టన్నులకు చేరిందని పేర్కొన్నది.
- గ్రామాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు తమ పంట ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించగలిగారని తెలిపింది. దీనివల్ల వ్యవసాయంపై ఆధారపడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడిందని పేర్కొన్నది.

### చెంగుచెంగున ఆర్థిక వృద్ధి

2014–2024 మధ్యకాలంలో దేశంలో అత్యంత వేగంగా ఆర్థిక అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణ నిలిచిందని గ్రోక్ తెలిపింది. తెలంగాణ సగటున 10–13% వార్షిక వృద్ధి రేటుతో ఆర్థికంగా బలపడిందని వెల్లడించింది. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్డీపీ), తలసరి ఆదాయం గణనీయంగా పెరిగాయని వెల్లడించింది. వ్యవసాయం, సేవలు, పరిశ్రమల రంగాలు ఆర్థిక వృద్ధికి ముఖ్యమైన సహకారం అందించాయని చెప్పింది.

- 2014లో జీఎస్డీపీ సుమారు రూ.4.5 లక్షల కోట్లు కాగా.. 2023–24 నాటికి రూ.14.63 లక్షల కోట్లకు పెరిగినట్టు తెలిపింది. ఇది 2014తో పోలిస్తే దాదాపు మూడు రెట్లు అని వివరించింది. జీఎస్డీపీ సగటున ఏటా 13.9 శాతం వృద్ధిరేటును సాధించినట్టు తెలిపింది.
- తలసరి ఆదాయం వృద్ధిలోనూ కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచినట్టు గ్రోక్ వెల్లడించింది. 2014–15లో రూ.1.24 లక్షలుగా ఉన్న తలసరి ఆదాయం 2023–24 నాటికి రూ.3.56 లక్షలకు చేరిందని పేర్కొన్నది. ఏటా సగటు వృద్ధిరేటు 12 శాతానికి మించి నమోదైనట్టు తెలిపింది. ఈ పెరుగుదల రాష్ట్రంలో జీవన ప్రమాణాలు మెరుగుపడటాన్ని సూచిస్తుందని స్పష్టం చేసింది.

### సాగునీటిరంగంపై భారీ వ్యయం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని తమ ప్రాధాన్యంగా ఎంచుకొని భారీగా ఖర్చు చేసినట్టు గ్రోక్ తెలిపింది. 'కేసీఆర్ ప్రభుత్వం సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టి సారించి, రూ.1.82 లక్షల కోట్లు ఖర్చు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు దీనికి ప్రధాన ఉదాహరణ. ఇది రాష్ట్రానికి గుండెకాయగా మారి, సాగు భూములకు నీటిని అందించింది' అని పేర్కొన్నది. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి వంటి భారీ ప్రాజెక్టులతో పాటు అనేక ఇతర ప్రాజెక్టులను చేపట్టినట్టు చెప్పింది. ఇవి వ్యవసాయ భూములకు నీటి లభ్యతను గణనీయంగా పెంచాయని ప్రశంసించింది. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితంగానే గోదావరి నది నీటిని ఉపయోగించి లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పింది. మిషన్ కాకతీయ ద్వారా 46,000 చెరువులను పునరుద్ధరించారని తెలిపింది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరిగిందని, చిన్న, సన్నకారు రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చిందని ప్రశంసించింది. ఇది వ్యవసాయ ఉత్పాదకతను మరింత పెంచడానికి సాయం చేసినట్టు తెలిపింది.

### విద్యుత్తు రంగంలో విప్లవం

తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాలకు 24 గంటల నిరంతర విద్యుత్తు సరఫరా అందించి.. తెలంగాణ దేశంలోనే ఏకైక రాష్ట్రంగా గుర్తింపు పొందిందని అభినందించింది. దీనివల్ల వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాలు స్థిరంగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నది. డిమాండ్‌కు తగినట్టుగా విద్యుత్తు సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేశారని తెలిపింది.

### రాజకీయ స్థిరత్వం, దీర్ఘకాలిక దృష్టి

తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థిరమైన పాలన అందించిందని గ్రోక్ తెలిపింది. దీనివల్ల వినూత్న పాలసీలు, సంస్కరణల అమలు సమర్థవంతంగా జరిగిందని అభినందించింది. ఫలితంగా.. 2016 నుంచి తెలంగాణ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్‌లో టాప్–3లో నిలిచిందని చెప్పింది. 2019–2024 ఆగస్టు వరకు 7.77 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించినట్టు పేర్కొన్నది. ఐటీ రంగంలో గూగుల్, అమెజాన్, యాపిల్ వంటి దిగ్గజ సంస్థలు, పారిశ్రామికపరంగా రిలయన్స్, టాటా వంటి సంస్థలు తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించాయని పేర్కొన్నది. ఇది ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చిందని గ్రోక్ అభిప్రాయపడింది. భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంతో అటు పట్టణ ప్రాంతాల్లో, ఇటు గ్రామీణ ప్రాంతాల్లోనూ గణనీయమైన వృద్ధి నమోదైనట్టు స్పష్టం చేసింది. స్థిరమైన ప్రభుత్వం, స్థిరమైన నిర్ణయాలు తెలంగాణ అభివృద్ధికి దోహదం చేసినట్టు వివరించింది.



మంగళవారం పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసిన బీఆర్‌ఎస్ ఎంపీలు వద్దిరాజు, సురేశ్‌రెడ్డి, పార్థసారథి రెడ్డి, దామోదర్‌రావు

# విమానాశ్రయాలను త్వరగా పూర్తిచేయండి

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు బీఆర్‌ఎస్ ఎంపీల విన్నపం

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఏర్పాటు చేయాల్సిన విమానాశ్రయాలను త్వరగా పూర్తిచేయాలని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, విప్ దీవకొండ దామోదర్‌రావు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరారు. మంగళవారం సాయంత్రం బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లోని మంత్రి చాంబర్‌లో ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో విమానశ్రయాల ఏర్పాటు అంశంపై చర్చించారు. వరంగల్‌లోని మామునూర్ విమానాశ్రయం పనులను వెంటనే మొదలుపెట్టి త్వరగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. నిజాం కాలంలో నిర్మించిన మామునూర్ ఎయిర్‌స్ట్రిప్ నుంచి గతంలో విమాన సర్వీసులు నడిచాయని గుర్తుచేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి సమీపాన ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన విమానశ్రయం పనులను వేగవంతం చేయాలని కోరారు. అక్కడ సింగరేణి సంస్థ ప్రధాన కార్యాలయంతోపాటు నవభారత్, ఐటీసీ, మణుగూరు భారజల ప్లాంట్ తదితర పలు రకాల పరిశ్రమలు ఉన్నాయని, దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చిపోయే భక్తులకు ఆ విమానాశ్రయం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన విమానశ్రయాల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ ఎంపీలు కోరగా.. అందుకు కేంద్ర మంత్రి సానుకూలత వ్యక్తం చేశారు.

### సహకార వర్సిటీ బిల్లుకు బీఆర్‌ఎస్ మద్దతు

**సహకార** రంగాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో గుజరాత్‌లోని ఆనంద్‌లో త్రిభువన్ సహకారి యూనివర్సిటీ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు రాజ్యసభ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించింది. మంగళవారం రాజ్యసభలో ఆ బిల్లుకు బీఆర్‌ఎస్ మద్దతు తెలిపింది. అంతకుముందు ఈ బిల్లుపై జరిగిన చర్చలో బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. ఈ బిల్లులో తెలంగాణకు ప్రాధాన్యం తగ్గడం ఆందోళన కలిగిస్తున్నదని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఒకే ఒక్క సహకార శిక్షణ కేంద్రం హైదరాబాద్‌లో ఉన్నదని ఆయన పేర్కొంటూ.. నిజామాబాద్, ఖమ్మం, ఆదిలాబాద్ లాంటి ప్రాంతాలకు ఈ కేంద్రాలను విస్తరించాలని కోరారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విలువైన 400 ఎకరాల భూములను అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ధ్వజమెత్తారు. ఆ భూమిలో సహకార యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### శంషాబాద్ నుంచి అమెరికాకు నేరుగా విమాన సర్వీసులు లేకపోవడం విచారకరం: వద్దిరాజు

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి అమెరికాకు నేరుగా విమాన సర్వీసులు లేకపోవడం విచారకరమని బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాజ్యసభలో ప్రసంగిస్తూ.. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోని ప్రధాన ఎయిర్‌పోర్టుల్లో ఒకటని, ఈ విమానాశ్రయం నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరంలో 10.2 లక్షల మంది అమెరికాకు ప్రయాణించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాజ్యసభలో ప్రవేశపెట్టిన విమాన వస్తువుల పరిరక్షణ బిల్లు–2025ను ఆయన ప్రశంసించారు. దేశ విమానయాన రంగాన్ని సమూలంగా మార్చేయడంతోపాటు అంతర్జాతీయ విమానయాన రంగానికి మన దేశం నాయకత్వం వహించేలా ఈ బిల్లు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. 2030 నాటికి ప్రపంచంలో అమెరికా, చైనా తర్వాత భారత్ మూడవ అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా ఆవిర్భవించే అవకాశం ఉన్నదని, దేశంలో విమానాశ్రయాల సంఖ్య 153 నుంచి 350కి పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ దిశగా ఎంతో కృషి చేస్తున్న తెలుగు బిడ్డ, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును అభినందిస్తున్నట్టు తెలిపారు.